తిమ్మాపూర్‌లో చిరుత కలకలం

రేగోడు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): చిరుత సంచరిస్తుందనే ప్రచారాన్ని తేలిగా తీసుకోవద్దని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని రేగోడు ఎస్‌ఐ పోచయ్య, అటవీశాఖ శంకరంపేట సెక్షన్ ఆఫీసర్ రమేష్ పేర్కొన్నారు. మండలంలోని తిమ్మాపూర్‌లో శనివారం పర్యటించి చిరుత కనిపించిందని చెప్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. గ్రామస్థుల నుంచి సేకరించారు. చిరుత సంచరించిన ఆనవాళ్లు కనిపించలేదని, అయినా పొలాలకు వెళ్లేవారు గుంపులుగా వెళ్లాలని సూచించారు. వారివెంట అటవీశాఖ బీట్ ఆఫీసర్ మనస్విని ఉన్నారు.







సంక్రాంతి పిండివంటలు

సంక్రాంతి పండుగంటే పిండివంటలు ఘుమఘుమలాడిల్సిందే. ఒకటా.. రెండా.. సకినాలు, అరిసెలు, గారెలు, చెకోడీలు, పూసలు, మురుకులు, నువ్వులముద్దలు.. ఆహా నోరూరిపోవాల్సిందే. ఈ పసందైన పిండివంటకాలు తయారు చేయడంలో మహిళలు బిజీ అయ్యారు. భోగి, సంక్రాంతి, కనుమను పురస్కరించుకుని మూడు రోజుల పాటు ఇళ్ల లోగిళ్లలో అందమైన ముగ్గులు వేయడానికి మహిళలు రంగులను కొనుగోలు చేస్తున్నారు.

- సిద్దిపేట జిల్లా ఫొటోగ్రాఫర్, (ఆంధ్రజ్యోతి)

సంగారెడ్డి రామ్‌మందిర్ భజనలో పాల్గొన్న జగ్గారెడ్డి

వైకుంఠ ఏకాదశి సందర్భంగా భజన పాటలు ఆలపించిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్

సంగారెడ్డి రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : వైకుంఠ ఏకాదశి సందర్భంగా సంగారెడ్డిలోని రామ్‌నగర్‌లో ఉన్న రామ్‌మందిరంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి భజన పాటలు ఆలపించారు. రామ్‌మందిరంలో నిర్వహించిన భజనలో ఆయన పాల్గొన్నారు. తన ఇంటి పక్కనే గల రామ్‌మందిర్‌లో ప్రతీ శనివారం జగ్గారెడ్డి భజన నిర్వహిస్తుంటారు. కాగా శుక్రవారం రాత్రి ముక్కోటి వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జరిగిన భజన కార్యక్రమంలోనూ ఆయన పాల్గొని ఆధ్యాత్మిక గీతాలను స్వయంగా ఆలపించి భక్తుల్లో ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో రామ్‌మందిర్ భజన మండలి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





సంగారెడ్డిలోని రామ్‌మందిర్‌లో జరిగిన భజనలో పాల్గొని భక్తి గీతాలు ఆలపిస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

మాకూ కావాలి పదవి

బీజేపీ సంస్థాగత పదవులకు భారీగా పోటీ

జిల్లా అధ్యక్ష స్థానం బరిలో ఏడుగురు.. ముగిసిన ఓటింగ్

అధిష్ఠానం చేతిలో ఫలితాలు.. పండుగ తరువాత ప్రకటన

మండల అధ్యక్ష స్థానాలకూ నువ్వా.. నేనా..



మెదక్ అర్బన్/నర్సాపూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీలో సంస్థాగత పదవుల కోసం ఇంతకుముందెన్నడూ లేనిరీతిలో ఈసారి నేతల మధ్య పోటీ నెలకొంది. బూత్‌స్థాయి నుంచి జిల్లాస్థాయి పదవులు భర్తీ చేయడానికి సీనియర్లంతా నానాఅగచాట్లు పడేవారు. అందుకు భిన్నంగా ఈసారి విపరీతమైన పోటీ నెలకొంది. బీజేపీలో సభ్యత్వ నమోదు పూర్తికావడంతో పాటు బూత్, మండల, జిల్లా అధ్యక్షుల నియామకాల కోసం కసరత్తు ప్రారంభమైంది. నేతలందరినీ సమన్వయపరిచి మండల, మున్సిపల్ అధ్యక్షుల నియమాకాన్ని దాదాపు పూర్తిచేశారు. మెదక్ జిల్లాలో మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 14 మండలాలతోపాటు మెదక్, నర్సాపూర్, రామాయంపేట టౌన్ అధ్యక్షులను ఎన్నుకోవడానికి ప్రక్రియను ప్రారంభించారు. ఇప్పటివరకు 12 మండలాల అధ్యక్షులు, జిల్లా కౌన్సిల్ సభ్యుల నియామాకాన్ని పూర్తిచేశారు. కొన్ని మండలాల్లో పార్టీ అధ్యక్ష పదవులకు నువ్వానేనా అన్నట్టుగా పోటీ నెలకొంది. మిగిలిన అధ్యక్షులు ప్రకటన కూడా ఒకటి రెండు రోజుల్లో వెలువడే అవకాశం ఉంది. వారం లోపు జిల్లా పార్టీ అధ్యక్షుడి ఎన్నిక పూర్తి చేసేందుకు కసరత్తు జరుగుతోంది.

జిల్లా అధ్యక్ష స్థానానికి తీవ్ర పోటీ

బీజేపీలో ప్రతీ మూడేళ్లకోసారి జిల్లా కమిటీని ఎన్నుకోవడం ఆనవాయితీ. ఈసారి బీజేపీ జిల్లా అధ్యక్ష పదవికి తీవ్ర పోటీ నెలకొంది. ఇప్పటికే జిల్లా అధ్యక్షుడిగా ఉన్న శ్రీనివాస్ పదవీ కాలం ముగిసి ఏడాది దాటింది. గతంలో జిల్లా అధ్యక్ష పదవికి పార్టీలో పెద్దగా పోటీ ఉండేదికాదు. అధ్యక్ష పదవికి ఏనాడూ ఎన్నిక జరగలేదు. ఇప్పటి వరకు ఉన్నవారందరూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసారి మాత్రం జిల్లా అధ్యక్ష పదవికి ప్రస్తుత అధ్యక్షుడు శ్రీనివాస్‌తోపాటు పాటు మెదక్ నియోజకవర్గం నుంచి అసెంబ్లీ ఇన్‌చార్జి పంజా విజయ్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి నందారెడ్డి, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాపన్నప్పగారి సుధాకర్‌రెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గం నుంచి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘువీరారెడ్డి, సీనియర్‌నేత వాల్దాస్ మల్లేశంగౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాపగారి రమేష్‌గౌడ్ బరిలో ఉన్నారు. మండలాలు, పట్టణ అధ్యక్షులతోపాటు పార్టీకి సేవలందించిన సీనియర్ నాయకులు జిల్లా కౌన్సిల్ సభ్యుల నియామకం పూర్తి చేశారు. వీరు అధ్యక్షుడి పేరు ప్రతిపాదిస్తారు. జిల్లాకు చెందిన రాష్ట్ర కమిటీ సభ్యులు, వివిధ రాష్ట్ర మోర్చాల సభ్యులు సైతం అధ్యక్షుడి పేరును ప్రతిపాదిస్తారు. ఈ ప్రక్రియను పూర్తిచేసి శుక్రవారం సంగారెడ్డి జిల్లా పార్టీ కార్యాలయంలో మెదక్ జిల్లా అధ్యక్ష పదవికి ఓటింగ్ నిర్వహించారు. ఈ ఓటింగ్‌లో 23 మంది పాల్గొన్నారు. జిల్లా అధ్యక్ష ఎన్నిక ఫలితాలు అధిష్ఠానం చేతికి చేరాయి పండుగ తర్వాత ఈ నెల 16 లేదా 17న రాష్ట్ర నాయకత్వం ఫలితాలు ప్రకటించనుంది.

విహారం.. విషాదం

కొండపోచమ్మసాగర్‌లో ఐదుగురు యువకులు గల్లంతు

మృతదేహాల గుర్తింపులో కీలకంగా కిట్టు బ్యాచ్

సహకరించిన శామీర్‌పేట లేక్ ఫైర్ అధికారులు

నేరుగా రిజర్వాయర్‌లోకి దూకిన సిద్దిపేట రూరల్ సీఐ

ఆరు గంటల పాటు సీపీ అనురాధ పర్యవేక్షణ



కొండపోచమ్మ రిజర్వాయర్ బండ్‌పై రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు



రోదిస్తున్న తల్లి

గజ్వేల్/మర్కుక్/ములుగు, జనవరి 11(ఆంధ్రజ్యోతి) : వారంతా స్నేహితులు.. సంక్రాంతి సెలవుల్లో సరదాగా బైకులపై కొండపోచమ్మసాగర్‌కు వచ్చారు. కొద్దిసేపు నీటిలో తుళ్లుతూ.. గెంతుతూ గడిపారు. ఫొటోలు దిగేందుకు మరింత దూరం వెళ్లారు. అదే ఐదుగురి ప్రాణాలను తీసింది. హైదరాబాద్ నగరం నుంచి కొండపోచమ్మసాగర్‌కు విహారయాత్రకు వచ్చిన ఏడుగురిలో ఐదుగురు యువకులు నీట మునిగి చనిపోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. చేతికి అందివచ్చిన పిల్లలు.. కొండపోచమ్మకు వెళ్తున్నామంటూ బయలుదేరి శవాలుగా కనిపించడంతో ఆ కుటుంబాలు కన్నీరుమున్నీరు అవుతున్నాయి. అయ్యో బిడ్డ ఎంత పనిజరిగింది అంటూ మృతదేహాలపై పడి రోదించారు.

అంతా హైదరాబాద్ వారే..

హైదరాబాద్ నగరంలోని బోలక్‌పూర్‌కు చెందిన అన్నదమ్ములు గ్యార ధనుష్(19), లోహిత్(17), బన్సీలాల్‌పేటకు చెందిన చీకట్ల దినేష్(17), అత్తాపూర్‌కు చెందిన సాహిల్ దీపక్ సుతార్(19), చింతల్‌బస్తీకి చెందిన ఉప్పల జతిన్(17), రాంనగర్‌కు చెందిన మృగాంక్, ముషీరాబాద్‌కు చెందిన మహ్మద్ ఇబ్రహీం(19) శనివారం ఉదయం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలోని కొండపోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మధ్యాహ్నం మర్కుక్ మండలంలోని కొండపోచమ్మసాగర్‌కు వచ్చారు. రిజర్వాయర్‌లో 9.37 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అక్కడి సేఫ్టీవాల్‌ను దాటి లోపలికి వెళ్లిన ఈ ఏడుగురు రిజర్వాయర్‌లో దిగి నీళ్లలో ఆడుతూ.. సరదాగా గడపారు. ఐదుగురు యువకులు లోపలికి వెళ్లి ఫొటో దిగుదామని ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయారు. అందులో నలుగురు యువకులు ధనుష్, లోహిత్, జతిన్, దినేష్ మునిగిపోగా సాహెల్ మాత్రం సహాయం కోసం 20 నుంచి 25 నిమిషాల పాటు సహాయం కోసం అరిచారు. బయట ఉన్న మృగాంక్, ఇబ్రహీం సైతం సాయం కోసం అరిచారు. రిజర్వాయర్‌లోకి ఎవరికి అనుమతి లేకపోవడం, అక్కడ ఎవరూ లేకపోవడంతో అటువైపు ఎవరు చూడలేదు. దీంతో సాయం కోసం ఎదురుచూసిన సాహెల్ సైతం నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ మృతి వార్త గజ్వేల్ డివిజన్‌తో పాటు సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా దావనంలా వ్యాపించింది. ఒక్కసారిగా ప్రజలంతా ఉలిక్కిపడ్డారు.

ఆరుగంటలు శ్రమించిన గజ ఈతగాళ్లు

మృతదేహాల ఆచూకీని కనిపెట్టేందుకు ఆరు గంటల పాటు గజ ఈతగాళ్లు శ్రమించారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ ఘటనా స్థలానికి చేరుకుని గజ్వేల్, తొగుట, స్థానిక గజ ఈతగాళ్లను మొదటగా పిలిపించారు. ఈ క్రమంలోనే సిద్దిపేట ఏసీపీ మధు, సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను సాయంత్రం నాలుగు గంటలవుతుండగా సిద్దిపేట కోమటిచెరువు కిట్టు బ్యాచ్‌ను తీసుకొని వచ్చారు. వెంటనే వారంతా రంగంలోకి దిగడంతో పాటు, సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను సైతం స్వయంగా రిజర్వాయర్‌లోకి దూకారు. ఈ క్రమంలోనే శామీర్‌పేట చెరువును చూసే ఫైర్ సిబ్బంది, స్థానిక గజఈతగాళ్ల సహకారంతో 20 నిమిషాల వ్యవధిలోని మొదటి మృతదేహాన్ని గుర్తించారు. దాదాపుగా ఆరు గంటల పాటు పోలీసులు, గజ ఈతగాళ్లు శ్రమించి ఐదు మృతదేహాలను బయటకు తీసుకువచ్చారు. దాదాపుగా ఆరు గంటల పాటు సీపీ డాక్టర్ బి.అనురాధ, గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి, గజ్వేల్ సీఐ మహేందర్‌రెడ్డి, తొగుట సీఐ ఎస్‌కే లతీఫ్ ఘటనా స్థలంలో నిలబడే ఉన్నారు. చివరగా సంఘటన వివరాలను తెలిపాలని సీపీని విలేకరులు కోరినా తాను ఒక తల్లినని, ఆ బాధలోనే ఉన్నానని చెబుతూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఫుడ్స్ కార్పొరేషన్



మృతదేహాల కోసం గాలిస్తున్న గజ ఈతగాళ్లు

మిగతా 7వ పేజీలో..

పార్కు స్థలంలో పాగా

రూ.10 కోట్ల విలువ చేసే జాగా ఇద్దరి పేరిట రిజిస్ట్రేషన్

ఓపెన్ ప్లాట్లకు ఇంటి నంబర్లు.. అడ్డదారిలో క్రమబద్ధీకరణ

నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం

సంగారెడ్డిలో బరితెగిస్తున్న అక్రమార్కులు



చదును చేసిన పార్కుస్థలం

సంగారెడ్డి టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో రియల్టర్లు బరితెగిస్తున్నారు. ఖాళీ స్థలం కనిపిస్తే పాగా వేస్తున్నారు. పార్కులు, ప్రజావసరాల కోసం వదిలిన స్థలాలను అడ్డదారిలో రిజిస్ట్రేషన్ చేయించుకొని నిర్మాణాలు చేపడుతున్నారు. మున్సిపల్ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారు. కట్టడి చేయాల్సిన మున్సిపల్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

రూ.10 కోట్ల స్థలంపై కన్ను

సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌లోని నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన ఓ వెంచర్‌లో పార్కులు, ప్రజా అవసరాల కోసం వదిలేసిన స్థలాలపై కొందరు కన్నేశారు. శాంతినగర్‌లోని 241 సర్వే నంబర్‌లో 1982లో ఎల్‌పీ నంబర్ 284/82 ప్రకారం వెంచర్‌ను ఏర్పాటుచేసి 113 ప్లాట్లను విక్రయించారు. ఈ వెంచర్‌లో పార్కులు, ప్రజా అవసరాల కోసం కొంత ఖాళీ స్థలాన్ని కేటాయించారు. ఇందులో 886 చదరపు గజాల స్థలాన్ని ఇద్దరు వ్యక్తులు 443 గజాల చొప్పున 1988లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ రెండు ప్లాట్లను 2010లో నిబంధనలకు విరుద్ధంగా క్రమబద్ధీకరించుకున్నారు. ప్రజావసరాల కోసం కేటాయించిన స్థలాన్ని ప్లాట్లుగా చూపించగా నిర్మాణాలకు మున్సిపాలిటీ అనుమతులు ఇవ్వకపోవడంతో రియల్టర్లు అడ్డదారిలో ఇంటటి నంబర్లను పొందారు. ఎలాంటి నిర్మాణాలు లేకపోయినా ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు తీసుకొని, నిబంధనలకు విరుద్ధంగా రెగ్యులరైజ్ చేయించుకున్నారు. ఓ ప్లాట్‌లో ఇటీవల ఓ భారీ అపార్ట్‌మెంట్‌ను నిర్మించారు. మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో మరో ప్లాట్‌లోనూ బహుళ అంతస్తుల భవనాన్ని నిర్మించేందుకు చదును చేశారు. మున్సిపాలిటీలో 'పెద్దల'ను రియల్టర్లు ప్రసన్నం చేసుకోవడంతోనే అధికారులు మిన్నకుండిపోవటంతో వ్యవహరిస్తున్నారని విమర్శలున్నాయి.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్‌క్రాంతి

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

ఈ నెల 21 నుంచి గ్రామసభలు : సంగారెడ్డి, మెదక్ కలెక్టర్లు


సంక్షేమ పథకాలకు అర్హుల ఎంపికపై అధికారులతో సమీక్ష

మెదక్ అర్బన్/సంగారెడ్డి రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. సంగారెడ్డి, మెదక్‌లలో వేర్వేరుగా వివిధ శాఖల అధికారులతో శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశాల్లో వారు మాట్లాడారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం ఈ నెల 21 నుంచి 24 వరకు పంచాయతీల్లో గ్రామసభలు, మున్సిపాలిటీల్లో వార్డుసభలను నిర్వహించాలని ఆదేశించారు. లబ్ధిదారుల వివరాలతో గ్రామపంచాయతీల్లో ఫ్లెక్సీలను ప్రదర్శించాలని ఆదేశించారు. సంగారెడ్డిలో నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్డీఏ పీడీజ్యోతి, వ్యవసాయశాఖ జేడీ శివప్రసాద్, జడ్పీ సీఈవో జానకీరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. మెదక్‌లో నిర్వహించిన సమీక్షలో ఆర్డీవో రమాదేవి, జయచంద్రరెడ్డి, మహిపాల్‌రెడ్డి, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో శ్రీనివాసరావు, డీపీవో యాదయ్య, డీఎస్‌వో సురేష్, డీఏవో వినయ్, హౌసింగ్ పీడీ మాణిక్యం, డీఈ, ఈఈలు, ఎంపీడీవో, ఏఈవో, ఏవోలు పాల్గొన్నారు.



అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్







సెయింట్ ఆంథోనీస్‌లో ఎస్ఎల్‌సీ కార్యక్రమం



ఎస్ఎస్‌సీ కార్యక్రమ ప్రారంభోత్సవంలో విద్యార్థులు, యాజమాన్యం

సంగారెడ్డి అర్బన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో స్టూడెంట్స్ లెడ్ కాన్ఫరెన్స్ (ఎస్ఎల్‌సీ) కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వెలికి తీయడం, విద్యార్థి నూతన విద్యా ఆవిష్కరణలకు పునాదులు వేయడం, తమ మేధస్సును ఉపయోగించి సరైన మార్గంలో ప్రయాణం చేయడం, సులభమైన పద్ధతిలో విద్యను నేర్చుకోవడం, ధారాళంగా మాట్లాడాలనేదే ఎస్ఎల్‌సీ కార్యక్రమం ఉద్దేశమని ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ అరుణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలోని చెట్లు నరికివేత



హెచ్‌ఎండీఏ భూమిలో నరికివేసిన చెట్లు

రామచంద్రాపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం మండలం తెల్లాపూర్‌లోని హెచ్‌ఎండీఏ భూమిలో పెంచిన చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు రాత్రిరాత్రి నరికివేశారు. రెండురోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తెల్లాపూర్‌లోని ఇందిరానగర్ వద్ద మిగులు భూమిలో హెచ్‌ఎండీఏ భూముల పరిరక్షణకు మొక్కలు నాటి పరిరక్షణకు సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఏపుగా పెరిగిన మొక్కలను రెండురోజుల క్రితం ఎవరో నరికివేశారు. ఎకరం రూ.40 కోట్లు పలుకుతున్న భూమిని కబ్జా చేయడానికి ప్రభుత్వ పెద్దలు యత్నిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. చెట్ల నరికివేతపై అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డికి వివరణ కోరగా అది హెచ్‌ఎండీఏ పరిధి అంటూ తెలిపారు.

రోడ్డు బాగు చేయాలని నిరాహార దీక్షలు



నిజాంపేటలో దీక్ష చేస్తున్న గ్రామస్థులు

నిజాంపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆ రోడ్డు ఐదేళ్లుగా నరకప్రాయంగా మారింది. బీటీరోడ్డు తీసి కంకర వేశారు. కానీ మళ్లీ తారు రోడ్డుగా వేయడం మరిచారు. ఇన్నేళ్లుగా ఇబ్బందులు పడుతున్నా.. అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహించిన నాలుగు గ్రామాల ప్రజలు నిరాహార దీక్షబూనారు. శనివారం మండల కేంద్రమైన నిజాంపేటలో టెంటు వేసుకొని భైఠాయించారు. రోడ్డు పనులు చేసేదాకా దీక్షలు వీడమంటూ నినదించారు.

హనుమాన్ ఆలయాలకు భక్తుల తాకిడి



కొండాపూర్ హనుమాన్ ఆలయంలో బారులు తీరిన భక్తులు

నారాయణఖేడ్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ ప్రాంతంలోని హనుమాన్ ఆలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. సంక్రాంతి సెలవులు కావడంతో, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఖేడ్ మండలం కొండాపూర్‌లోని చరిత్రాత్మకమైన హనుమాన్ ఆలయంలో ఉదయం నుంచే బారులుతీరి హనుమంతుడిని దర్శించుకున్నారు. భక్తులు ఆలయ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్ ఆశీస్సులు పొందారు. డోవూరు లొంక హనుమాన్, ఖేడ్ పట్టణంలోని కల్పనా హనుమాన్, భూమయ్య కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయాలకు సైతం భక్తుల తాకిడి పెరిగింది.

రింగ్‌రోడ్డుతో తీరనున్న ట్రాఫిక్ సమస్యలు



ఖేడ్‌లో రోడ్డు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ జగ్జీవన్ తదితరులు

నారాయణఖేడ్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ మున్సిపాలిటీ చుట్టూ బిట్లు వారీగా లింక్‌రోడ్లతో నిర్మిస్తున్న రింగ్‌రోడ్డు వల్ల పట్టణంలో తీవ్రంగా ఉన్న ట్రాఫిక్ సమస్యలు తీరుతాయని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ తెలిపారు. మున్సిపాలిటీ శివారులోని ఖేడ్-కంగ్టి రోడ్డు నుంచి చాంద్‌ఖాన్‌పల్లి కమాన్ వరకు బిట్టుగా నిర్మిస్తున్న రోడ్డు పనులను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఖేడ్-కరస్‌గుత్తి రోడ్డులోని మనూరు క్రాస్ రోడ్డు వద్ద 161బీ జాతీయ రహదారి నుంచి మున్సిపాలిటీ చుట్టుగా డీఎస్పీ కార్యాలయం వద్ద 161బీ జాతీయ రహదారినికలుపుతూ ఫార్మేషన్ రోడ్డుగా నిర్మిస్తున్నామన్నారు. ఆయన వెంట కౌన్సిలర్ మూడ రామక్రిష్ణ, మాజీ ఎంపీటీసీలు పండరిరెడ్డి, గడీల నర్సింలు, నాయకుడు శంకర్‌నాయక్ ఉన్నారు.

ఎస్‌పీఎల్ క్రికెట్ పోటీలు ప్రారంభం

పుల్‌కల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం బద్రిగూడెం గ్రామంలో సుల్తాన్‌పూర్ ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) సీజన్-5 క్రికెట్ క్రీడోత్సవాలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వారంరోజులపాటు కొనసాగనున్న ఈ పోటీలను పుల్కల్ ఎస్ఐ క్రాంతికుమార్ పాటిల్, బీఆర్ఎస్ ఉమ్మడి మండలం సీనియర్ నాయకుడు పట్లోళ్ల విజయభాస్కర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు.

మస్తు పూత.. నిలబెట్టుకోండిలా..

మద్దూరు, జనవరి 11 : మండలంలో ఈ సారి మామిళ్లకు మస్తు పూత కాసింది. ఈ పూత నిలువడానికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానశాఖాధికారులు సూచిస్తున్నారు. ప్రతి 15 నుంచి 20 రోజులకు ఒకసారి నీరు పెట్టాలంటున్నారు. పూత పిందెగా మారే సమయంలో మందులు వాడితే రాలకుండా ఉంటుందని చెబుతున్నారు. నీటి తడులతో పాటు కిలో పొటాష్, కిలో యూరియా చెట్లకు వేస్తే కాయ బరువు పెరగడంతోపాటు నాణ్యమైన దిగుబడి వస్తుందన్నారు. ఉమ్మడి మండలం వ్యాప్తంగా సుమారు 80 ఎకరాల్లో రైతులు మామిడి తోటలు సాగు చేశారు.


ధర్మారంలో ఇరగపూసిన మామిడి పూత

కంది.. దిగుబడిపై రంధీ

మనూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కంది పంట ఏపుగా పెరిగినప్పటికీ సరిగా దిగుబడి రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది కందులకు మంచి డిమాండ్ ఉండడంతో నారాయణఖేడ్ ప్రాంతంలో ఈసారి అధికమంది కందులను సాగు చేశారు. పూత, కాత సమయంలో వర్షాలు సరిగా పడలేదు. ఆ తరువాత కురిసిన భారీ వర్షాలకు మొక్కలు ఏపుగా పెరిగినా కాయల్లో విత్తులు ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందక దిగుబడి తగ్గిందని రైతులు పేర్కొంటున్నారు. గతేడాది ఎకరాకు 8 క్వింటాళ్ల దిగుబడి వస్తే.. ఈసారి 5 క్వింటాళ్ల చొప్పున కూడా రావడం లేదని వాపోతున్నారు. పెట్టుబడులు కూడా దక్కే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి కందులకు మద్దతు ధరను పెంచి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



శనగ కూరకు భలే డిమాండ్

నారాయణఖేడ్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): చలికాలంలో మాత్రమే లభించే శనగ కూరకు మార్కెట్‌లో భలే డిమాండ్ ఉన్నది. రబీలో సాగు చేసే శనగ(బెంగాల్ గ్రామ్) పంట నుంచి పూత పూయక ముందు ఆకులను కోసి కూరలు చేసుకోవడానికి వినియోగిస్తారు. సీజనల్‌లో మాత్రమే లభించే శనగ కూరను కొనుగోలు చేసేందుకు జనం పెద్ద ఎత్తున ఆసక్తి చూపుతున్నారు. కిలో శనగ కూర రూ.200 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నారు.



క్రైం కార్నర్

చెరకు బండి కిందపడి బాలుడి మృతి

నారాయణఖేడ్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): చెరకు బండి కింద పడి బాలుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఖేడ్ మండలం గైర్హాన్ తండాకు చెందిన విజయ్‌కుమార్, సుమిత్రాబాయి దంపతుల ఏకైక కుమారుడు నితిన్‌నాయక్(5)తో కలిసి రెండు నెలల క్రితం చెరకు నరికే పని కోసం కర్ణాటకలోని బీదర్ జిల్లాకు వెళ్లారు. శనివారం ఆ జిల్లాలోని శివరాంపూర్ గ్రామ శివారులో చెరకు నరికే పని చేస్తుండగా, నితిన్ పొలం పక్కన ఆడుకుంటున్నాడు. నరికిన చెరకును కర్మాగారానికి తరలిస్తున్న ఎద్దుల బండి ప్రమాదవశాత్తు బాలుడి పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులతో పాటు బంధువుల రోదనలు మిన్నంటాయి. శనివారం సాయంత్రం గైర్హాన్‌తండాలో బాలుడి అంత్యక్రియలు నిర్వహించారు. ఖేడ్ తాజామాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, మాజీ ఎంపీటీసీ రాజునాయక్, తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. బాలుడి కుటుంబాన్ని ఆదుకోవాలని వారు కలెక్టర్‌ను కోరారు.


నితిన్‌నాయక్ మృతదేహం

పసివాడి ప్రాణం తీసిన పతంగి

- పతంగి కోసం పరిగెత్తిన బాలుడు
- ట్రాక్టర్ ఢీ కొట్టడం తో మృతి

జోగిపేట, జనవరి11 (ఆంధ్రజ్యోతి): తెగిన గాలిపటం (పతంగి) కోసం పరిగెత్తిన ఓ బాలుడు ట్రాక్టర్ ఢీ కొని మృతి చెందిన ఘటన సంగారెడ్డి జిల్లా జోగిపేటలో శనివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. టేక్మాల్ గ్రామానికి చెందిన నీరుడి శ్రీరామ్(11) అనే బాలుడు ఇంట్లో చెప్పకుండా స్నేహితులైన మరో ముగ్గురు స్నేహితులతో కలిసి పతంగుల (గాలిపటాలు) కొనుక్కునేందుకుగానూ ఆటోలో జోగిపేటకు వచ్చారు. పతంగులు కొనుగోలు చేసి ఒక ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో తిన్నారు. ఇంటికి తిరిగి వెళ్లేందుకు ఆటో కోసం బస్టాండ్ వద్దకు వచ్చారు. ఇదే సమయంలో ఒక పతంగి తెగిపోయి రోడ్డుపై పడిపోతోంది. దానిని అందుకుందామన్న ఆశతో శ్రీరామ్ రోడ్డుకు అడ్డంగా పరిగెత్తాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్, బాలుడిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. అక్కడే ఉన్న వారు బాలుడిని ఏరియా ఆస్పత్రికి తరలించినా లాభం లేకపోయింది. శ్రీరాం తండ్రి సాయిలు 4ఏళ్ల క్రితం చెరువులో పడి మృతి చెందాడు. తల్లి జ్యోతి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్. ఐ. పాండు తెలిపారు.


నీరుడి శ్రీరామ్

నందిగామ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- రెండు ముక్కలైన మృతదేహం.. మరొకరికి గాయాలు

పటాన్‌చెరు రూరల్, జనవరి 11 : బీడీఎల్ బానూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నందిగామ వద్ద శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. బీడీఎల్ సీఐ స్వామి గౌడ్ అందించిన కథనం ప్రకారం శంకర్‌పల్లి గణేష్‌నగర్ కాలనీకి చెందిన గొట్టిముక్కల అశోక్ (45), మణిసంకిత్ (20)లు స్కూటీపై పటాన్‌చెరు నుంచి శంకర్‌పల్లి వైపు వెళ్తుండగా నందిగామ నారాయణ స్కూల్ సమీపంలో వెనుక నుంచి వస్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. అశోక్ అక్కడికక్కడే మృతిచెందగా, మణిసంకిత్ తీవ్రంగా గాయపడ్డాడు. అశోక్ మీద నుంచి లారీ వెళ్లిపోవడంతో మృతదేహం రెండు భాగాలుగా విడిపోయింది. సమాచారం అందుకున్న బీడీఎల్ సీఐ స్వామి గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకొని మణిసంకిత్‌ను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అశోక్ మృతదేహన్ని పంచనామా నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దుకాణంలో అగ్ని ప్రమాదం

- కాలి బూడిదైన సామగ్రి


కాలి బూడిదైన సామగ్రి

నర్సాపూర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పట్టణంలోని బస్టాండు ఎదురుగా ఉన్న ఓ హోల్‌సేల్ కిరాణా దుకాణంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. బాధితుడు శ్యామ్‌సుందర్ తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం రాత్రి 8.30 గంటలకు దుకాణం బంద్ చేసి కుటుంబ సభ్యులతో నాచారం వెళ్లాడు. శనివారం తెల్లవారుజామున దుకాణంలో షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. 5 గంటలకు గమనించిన షాపు పక్కనే ఉండే ఓ వ్యక్తి శ్యామ్ సుందర్‌కు ఫోన్ చేసి చెప్పాడు. ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న సిబ్బంది మంటలను ఆర్పారు. అప్పటికే పెద్ద ఎత్తున కిరాణా సామగ్రి కాలి బూడిదగా మారింది. రూ.లక్షల్లో నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

దేవుడి దీపం కిందపడి.. ఇల్లు దగ్ధం

తొగుట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి ఇల్లు దగ్ధమైన సంఘటన తొగుట మండలం చందాపూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. బాధితులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నూనె మహేష్ ఇంట్లో ఉదయం దేవుడి గదిలో దీపం వెలిగించారు. ప్రమాదవశాత్తూ దీపం కిందపడి ఇంట్లో మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న ఫైర్ ఇంజన్ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే ఇంట్లో సామగ్రితోపాటు, 8 తులాల బంగారం, 25 తులాల వెండి ఆభరణాలు, రూ.3.80లక్షల నగదు అగ్నికి ఆహుతి అయ్యాయి. రెవెన్యూ అధికారులు ఘటనా స్థలికి చేరుకుని నష్టం వివరాలను తెలుసుకున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ నర్సింహులు కోరారు.



మా తాతల నుంచి ఈ ఆచారం వస్తుంది : కాసర్ల కొత్తకొండ

ఈ ఆచారం మా తాతల కాలం నుంచి వస్తుంది. మా తాత రామలింగం, తండ్రి కాసర్ల బుచ్చయ్య కొత్తకొండ వీరభద్రస్వామి భక్తులు. అందుకే నాకు కొత్తకొండ అని పేరు కూడా పెట్టారు. వారు ఇచ్చిన ఈ ఆచారాన్ని నేను 30 ఏళ్లుగా కొనసాగిస్తున్నాను. మా పిల్లలు కూడా ఇప్పటి నుంచే భాగస్వాములవుతున్నారు.

బండెనక బండి.. ఊరే కదులుతదండి


కొత్తకొండ జాతరకు జనగామ నుంచి వెళ్తున్న ఎడ్లబండ్లు (ఫైల్)

- ఏటా హన్మకొండ జిల్లాలోని కొత్తకొండ వీరభద్ర స్వామి జాతరకు పయనం
- ఎడ్లబండ్లపైనే 20 కిలోమీటర్ల ప్రయాణం
- 70 ఏళ్లుగా కొనసాగుతున్న ఆనవాయితీ

సంక్రాంతికి జనగామ గ్రామ ప్రత్యేకత

హుస్నాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ అంటే పిండి వంటలు, హరిదాసు కీర్తనలు, గంగిరెద్దులు, సన్నాయి మోతలు, గాలిపటాలే గుర్తుకొస్తాయి. కానీ హుస్నాబాద్ మండలం జనగామ గ్రామంలో మాత్రం కచ్చురంతో కూడిన ఎడ్ల బండ్లు సంక్రాంతి స్పెషల్‌గా నిలుస్తాయి. సంక్రాంతి రోజున హన్మకొండ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని భీమదేవరపల్లి మండలం కొత్తకొండలో జరిగే వీరభద్రస్వామి జాతరకు వెళ్లడం ఈ గ్రామ ఆనవాయితీ. ఎడ్ల బండ్లపై కచ్చురాలు ఏర్పాటు చేసుకుని, అందంగా అలకంరిచుకుని 20 కిలోమీటర్ల మేర ప్రయాణించి జాతరకు వెళ్లడం గ్రామ ప్రత్యేకత. మూడు రోజుల ముందు నుంచే ఈ పయనానికి సిద్ధమవుతారు. బండెనక బండి సమారు వంద బండ్లలో గ్రామస్థులు ఒకేసారి వెళ్తుంటే.. చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తారు. 70 ఏళ్లుగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని గ్రామస్థులు ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. అప్పటివరకు రాజకీయ విద్వేశాలు, కులాలు, మతాలు తదితర గొడవలు ఉన్నప్పటికీ సంక్రాంతి పండుగ వచ్చిందంటే అందరూ కలసిపోయి మూకుమ్మడిగా జాతర వెళ్తారు. ఈ బండ్లను గ్రామ శివారు వరకు సాగనంపడానికి చిన్న పెద్ద తేడా లేకుండా ఊరుఊరంతా కదలివస్తుంది.


జాతరకు ముస్తాబవుతున్న ఎడ్ల బండి(ఫైల్)

పయనమే.. ఓ పండగలా..

సంక్రాంతి రోజున మధ్యాహ్నం జనగామకు చెందిన కాసర్ల కొత్తకొండ అనే వీరభద్రస్వామి భక్తుడు ప్రత్యేక వేషధారణతో దర్శనమిస్తాడు. ఈ జాతరకు నెల రోజుల ముందు ధనుర్మాసం ప్రారంభమైన నుంచి ఆయన ఉపవాస దీక్షల్లో ఉంటాడు. మొదటి కచ్చురం అతని ఇంటి నుంచే బయలు దేరుతుంది. ఆయన బండి వెనుకనే మిగతావి బయలు దేరుతాయి. బ్యాండ్ మేళాల మధ్య ఊరంతా కదలిరాగా ముందున దివిటీలు పట్టుకొని ఒకరు వెళ్తుంటారు. ఈ దివిటీలకు పోసిన నూనెను చిన్నారుల తలకు అంటుతే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారనేది గ్రామస్తుల నమ్మకం. గ్రామ కూడళ్లలో కొత్తకొండ వీరభద్రస్వామి చరిత్రను తన దండకం ద్వారా ప్రజలకు వివరిస్తాడు. అతనికి గ్రామస్థులు కొత్తకొండలోని వీరభద్రస్వామికి కానుకలుగా ఇచ్చేందుకు కరెన్సీ నోట్లను మాలలుగా చేసి ఆయన మెడలో వేస్తారు. అతను ప్రజలందరికి విబూతి పెడుతూ దీవెనలు అందజేస్తాడు.


వీరభద్రస్వామి ప్రాశాస్త్రాన్ని దండకం ద్వారా చెబుతున్న కాసర్ల కొత్తకొండ (ఫైల్)

వివాహం చేసుకున్నాకే ప్రేమజంట ఆత్మహత్య

నారాయణఖేడ్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పెళ్లికి పెద్దలు అంగీకరించరనే ఆందోళనతో ప్రేమ జంట మునిపల్లి సమీపంలోని హరిత హోటల్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయం విధితమే. మండల కేంద్రమైన నిజాంపేటకు చెందిన ఉదయ్‌కుమార్(21), రోహిత(19) కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇరు కుటుంబాలు వారి వివాహానికి అభ్యంతరం తెలిపారు. దీంతో ఈ నెల 9న మునిపల్లి సమీపంలోని హరిత హోటల్‌కు వెళ్లి గదిని అద్దెకు తీసుకొని ముందుగా వివాహం చేసుకున్న తరువాతే ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. కాగా, పోస్టుమార్టం అనంతరం మృతదేహలను శనివారం కుటుంబ సభ్యులకు అప్పగించడంతో సాయంత్రం అశ్రునయనాలతో విడివిడిగా అంత్యక్రియలు నిర్వహించారు.

ఉపాధిహామీ పనుల్లో అవకతవకలు

కౌడిపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మహత్మా గాంధి జాతీయ 15 వ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండల కేంద్రంలో నిర్వహించిన సామాజిక తనిఖీ అవతవకలు బయటపడ్డాయి. దీంతో వెల్మకన్నె గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ ముత్తయ్య, ధర్మసాగర్ ఫీల్డ్ అసిస్టెంట్ మల్లేశం రూ.5,66,849 రికవరీ చేయగా, రూ.76 వేలు జరిమానా విధించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలు, ఏపీవో కలసి జిల్లా ఉన్నతాధికారుల అండదండలతో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు వస్తున్నాయి త్వరలోనే ఇదే విషయంలో మరికొంత మందికి మెమోలు ఇవ్వనున్నట్లు తెలిసింది. అదేవిధంగా కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.


గొల్లపల్లిలో డ్రిప్ పద్ధతిలో ఉల్లి పంట సాగు

అధునిక వ్యవసాయం వైపు రైతుల చూపు

- ఉల్లి పంటలో వినూత్న పద్ధతిని అవలంభిస్తున్న రైతులు

కొండాపూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : కూలీల కొరతను అధిగమించి, కలుపు నివారణ, పంటకు వేసిన మందులు, ఎరువులు దుర్వినియోగం కాకుండా మొతాదులో వాడి సాగు పంటలో ఖర్చులు తగ్గించేందుకు రైతులు వినూత్న పద్ధతిని అవలంభిస్తున్నారు. ఉల్లి పంటలో నారుమడి కట్టి నీరు నింపి తరువాత నారు వేసి, ఎరువులను చల్లే పాత పద్ధతిని రైతులు వీడనాడుతున్నారు. ఉల్లిగడ్డ పంట సాగులో డ్రిప్ పద్ధతిని పాటిస్తూ నీటి వృథా, నారుమడి, కలుపు తీత కూలీ ఖర్చులను తగ్గించుకునే దిశగా ఆసక్తి చూపుతున్నారు. ప్లాస్టిక్ పేపర్‌ను భూమిపై పరిచి ఉల్లి పంటసాగుకు చేస్తున్నారు. పెరిగిన ఎరువుల,మందుల ధరలకు అనుగుణంగా తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి పొందేందుకు నూతన పద్ధతిని అవలంభిస్తున్నారు.


తేర్పోల్ గ్రామంలో ఉలిగడ్డ నాట్లు

పుచ్చకాయపై వివేకానందుడి చిత్రం

నారాయణఖేడ్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): నేడు స్వామి వివేకానందుడి జయంతిని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్టు శివకుమార్ తన కళతో వినూత్నంగా నివాళుల ర్పించాడు. పుచ్చకాయ, బాదం ఆకులపై స్వామి వివేకానందుడి చిత్రాలను గీసి ఔరా అనిపించాడు.



మిషన్ భగీరథ కార్మికుల ధర్నా


బోర్పట్ల మిషన్ భగీరథ ప్లాంటు వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

హత్నూర, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): హత్నూర మండల పరిధిలోని బోర్పట్ల మిషన్ భగీరథ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ వద్ద పని చేస్తున్న కార్మికులు శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఫిల్టర్ బెడ్ ప్రధాన ద్వారం ముందు బైఠాయించి, కాంట్రాక్టర్, అధికారుల తీరుపై ఆగ్రహ వ్యక్తం చేశారు. ఐదు నెలలుగా తమకు జీతాలు చెల్లించడం లేదని, ఇక తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఐదు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. అదేవిధంగా ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యంతో పాటు కనీస వేతనం 18వేల రూపాయలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని ఎడల ఆందోళన కార్యక్రమాన్ని మరింత ఉధృతం చేయనున్నట్లు వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా మిషన్ భగీరథ కార్మిక సంఘం అధ్యక్షుడు జక్కుల బాబయ్య. లక్ష్మణ్, కుమారస్వామి, రాజు, రవి, నవీన్, విష్ణు, విష్ణువర్ధన్, సత్యనారాయణ, రవీందర్, శ్రీకాంత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరులో 2 కొత్త సబ్‌స్టేషన్లు

- త్వరలో ప్రారంభించే దిశగా దక్షిణ డిస్కం చర్యలు

హైదరాబాద్ సిటీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సమ్మర్‌లో పెరిగే విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేలా సంగారెడ్డి సర్కిల్ పటాన్‌చెరు డివిజన్‌లో రెంటు కొత్త సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసిన దక్షిణ డిస్కం వాటిని త్వరలో ప్రారంభించే దిశగా ఏర్పాట్లు చేస్తోంది. గతేడాది సమ్మర్‌లో పెరిగిన రికార్డుస్థాయి డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని చక్రపురి, గోషాల ప్రాంతాల్లో 16 ఎంవీఏ సామర్థ్యంలో 2 కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టింది. ఈ సబ్‌స్టేషన్ పనులు పూర్తి చేసిన అధికారులు వాటిని త్వరలో చార్జ్‌చేసే దిశగా చర్యలు చేపట్టారు. ఈ నెలలో రెండు సబ్‌స్టేషన్ల చార్జింగ్ చేసేదిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రెండు సబ్‌స్టేషన్లు అందుబాటులోకి రావడంతో పటాన్‌చెరువు డివిజన్‌లో డిమాండ్ ఏస్థాయిలో పెరిగిన సమ్మర్‌లో ఇబ్బందులు తలెత్తవని అధికారులు చెబుతున్నారు.

విహారం.. విషాదం

(5వ పేజీ తరువాయి)

మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

కొండపోచమ్మసాగర్ బండ్‌పై మిన్నంటిన రోదనలు

ఐదుగురు యువకులు మృతిచెందగా, నాలుగు కుటుంబాలకు చెందిన బంధువులు, కుటుంబసభ్యులు బండ్‌పైకి చేరుకున్నారు. ఈ క్రమంలోనే బండ్‌పై పూర్తిగా విషాదఛాయలు అలుముకున్నాయి. ఎక్కడ చూసిన రోదనలు కనిపించాయి. ఇద్దరు పిల్లల్ని కోల్పోయిన నర్సింగరావు కుటుంబాన్ని చూసి ప్రతీఒక్కరు కన్నీటి పర్యంతమయ్యారు. వారిని సముదాయించేందుకు ఎవరు ప్రయత్నించినా కూడా కడుపుకోత మిగిల్చిన కుమారులను చూసి ఆవేదన వ్యక్తం చేశారు.

గజ్వేల్ ఆసుపత్రిలో పోస్టుమార్టం పూర్తి

గజ్వేల్ పట్టణంలోని జిల్లా ఆసుపత్రిలో ఐదుగురు యువకులు మృతదేహాలకు వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. సీఐలు సైదా, లతీఫ్ ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించి వారి కుటుంబాలకు మృతదేహలను అప్పగించారు. గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఒక్కసారిగా ఐదుగురి మృతదేహాలు మార్చురీకి రావడంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబాలను గజ్వేల్ బీఆర్ఎస్ ఇన్‌చార్జీ వంటేరు ప్రతాప్‌రెడ్డి పరామర్శించారు. ఈ క్రమంలోనే గజ్వేల్ ఆసుపత్రి ప్రాంగణం రోదనలతో మునిగిపోయింది.


సంఘటనా స్థలం వద్ద సిద్దిపేట ఎస్పీ



రోడ్లపైనే కూరగాయల అమ్మకాలు



నిరుపయోగంగా రైతుబజార్

కూరగాయల మార్కెట్‌కు స్థలమేదీ..!

- అరకోటి నిధులు వెచ్చించినా రైతుబజార్ నిరుపయోగం
- రెండు దశాబ్దాలుగా రోడ్లపైనే అమ్మకాలు
- మార్కెట్‌కు అనువైన స్థలం చూపని మున్సిపల్ అధికారులు
- ఆందోళనకు సిద్ధమవుతున్న విక్రయదారులు

రామాయంపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేటలో రోజువారీ కూరగాయల మార్కెట్‌కు స్థలమే లేకుండాపోయింది. దీనివల్ల దశాబ్దాల కాలంగా దుమ్ము రోడ్లపైనే అమ్మకాలు చేయాల్సి వస్తోంది. అరకోటి రూపాయలతో నిర్మించిన రైతుబజార్ సౌకర్యవంతంగా లేదు. అక్కడ అమ్మకాలు చేసేందుకు రైతులు, వ్యాపారులు సుముఖంగా లేరు. దీనివల్ల రైతుబజార్ నిరుపయోగంగా మారింది. ఐదేళ్ల క్రితం వరకు మెయిన్ రోడ్డు ఆనుకొని కూరగాయల విక్రయాలు సాగేవి. వచ్చేపోయే వాహనాలకు, ప్రజలకు ఇబ్బందులు ఏర్పడటం వల్ల.. కరోనా సమయంలో పట్టణంలోని చర్చి మైదానంలోకి తాత్కాలికంగా మార్చారు. ఇక్కడ ఎలాంటి వసతులు లేకున్నా.. ఖాళీస్థలాల్లో డేరాలు వేసుకొని అమ్మకాలు సాగించాల్సిన దుస్థితి పట్టింది. అయినా సరే.. అంటూ విక్రయాలు చేస్తున్న క్రమంలో నిర్వాహకుల నుంచి తొలగించాలంటూ ఒత్తిడి పెరిగింది. ఇంకో పక్క హెచ్చరికలూ అధికమయ్యాయి. దీంతో ప్రస్తుతం మార్కెట్ ఎక్కడికి తరలించాలి..? విక్రయాలు ఎక్కడ జరపాలో..! తెలియక వ్యాపారులు అయోమయంలో పడ్డారు. ఇంత జరుగుతున్నా తైబజార్ వసూళ్లు అయితే బరాబర్ చేస్తారు..! కానీ అనువైన స్థలం ఎందుకు చూపరంటూ.. కూరగాయల రైతులు, వ్యాపారులు మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారంరోజులుగా మార్కెట్ కోసం ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

మరిన్ని నిధులు కేటాయించాలి

ఇదిలా ఉంటే అరకోటితో ఏర్పాటైన రైతుబజార్‌లో మరిన్ని నిధులు వెచ్చించి బాగుచేస్తే మేలు చేకూరుతుంది. వెళ్లేందుకు సరైన రోడ్డు మార్గం లేనందున మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది. కూరగాయల అమ్మకాల కోసం 2004లోనే ఇది నిర్మితమైంది. అయితే వ్యాపారుల్లో కొందరు మెయిన్ రోడ్డుపై అమ్మకాలు చేయడం.. మరికొందరు రోడ్లపై కూరగాయలు విక్రయించడం వల్ల దూరాన ఉన్న తమ వద్ద ఎవరు కొంటారని కూరగాయల వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్‌శాఖ పటిష్టమైన చర్యలు చేపట్టి పూర్తిస్థాయిలో కూరగాయల అమ్మకాలు రైతుబజార్లోనే జరిగేలా చూడాల్సి ఉంది. అంతేకాదు అక్కడికి వెళ్లేందుకు రోడ్డును బాగుచేసి మూత్రశాలలు ఇతర సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

హోరాహోరీగా ఓపెన్ టూ ఆల్ క్రీడలు

గుమ్మడిదల/రేగోడు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండల కేంద్రంలో సీజీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ టూ ఆల్ క్రీడా పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను సంగారెడ్డి అదనపు ఎస్పీ సంజీవరావు ముఖ్యఅతిథిగా హాజరై ట్రస్టు చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు వైస్ చైర్మన్ చిమ్ముల నరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే రేగోడు మండలంలో టీ లింగంపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ బదిలీ అనుమప్ప స్మారక వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ బగిలి శ్రీనివాస్ శనివారం తెలిపారు. మొదటి విజేతకు రూ.20,111, రెండో విజేతకు రూ.10,111 నగదు బహుమతులు అందజేసినట్లు తెలిపారు. 12వ తేదీవరకు ఆసక్తిగల క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. 13, 14వ తేదీల్లో టీ లింగంపల్లి నల్లపోచమ్మ దేవి కమాన్ పక్కన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ కార్మికులకు భోజనాలు ఏర్పాటు

నారాయణఖేడ్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకొని ప్రత్యేక బస్సులను నడుపుతున్నందున డిపో పరిరక్షణలో భాగంగా ఆర్టీసీ డీఎం మల్లేశయ్య ఆదేశాల మేరకు ప్రత్యేక బస్సుల్లో విధులు నిర్వర్తిస్తున్న డ్రైవర్లు, కండక్టర్లకు భోజనాలు ఏర్పాటు చేశారు. శనివారం భోజనాలను ప్యాకెట్లలో ఉంచి ఖేడ్ పట్టణంలోని రాజీవ్ చౌక్‌లో అసిస్టెంట్ మేనేజర్ నర్సింహులు, సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నందులాల్, పీఆర్వో పాండు, డ్రైవర్లు, కండక్టర్లకు అందజేశారు.

క్రైం కార్నర్

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

చేగుంట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతూ వ్యక్తి ఉరేసుకుని శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. చేగుంట మండలం అన్నంతసాగర్ గ్రామానికి చెందిన మెండే సత్యనారాయణ(51) ములుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆరోగ్యం నయం కాకపోవడంతో మనస్తాపానికి గురై శనివారం ఉదయం ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తూప్రాన్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ వెల్లడించారు.

మానసిక బాధలతో యువకుడు..

జోగిపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మానసిక సమస్యలతో యువకుడు శనివారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్ఐ పాండు వివరాల ప్రకారం.. జోగిపేటకు చెందిన నర్రా రాజశేఖర్(30) ఇటీవల తరచూ అనారోగ్యానికి గురవుతున్నాడు. దీంతో మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో శనివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేణుకామాత ఆలయంలో చోరీ

కొల్చారం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కొల్చారంలో రేణుకామాత ఆలయంలో దొంగలు పడ్డారు. శుక్రవారం రాత్రి ఆలయ మండపంలోకి ప్రవేశించి ఎస్ఎస్ డోర్‌ను, గుడి ప్రధాన ద్వారాన్ని ధ్వంసం చేసి హుండీని కొద్దిదూరం తీసుకెళ్లారు. అనంతరం దాన్ని పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. గౌడ సంఘం సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహ్మద్ గౌస్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. క్లూస్‌టీం సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. ఆలయంలోని అన్ని సీసీ కెమెరాల లైవ్ ఫుటేజీని పరిశీలించారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

అభివృద్ధి పనులకు పరిశ్రమలు సహకరించాలి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పనులకు నియోజకవర్గంలోని పరిశ్రమలు సహకరించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కోరారు. శనివారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో కోటి రూపాయల విలువైన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసి మాట్లాడారు. నియోజకవర్గంలో అనేక పరిశ్రమలు ఉన్నాయని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో యాజమాన్యాలు తోడ్పాటు అందించాలన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సామాజిక బాధ్యత) నిధులు ప్రభుత్వానికి చెల్లిస్తున్నా స్థానికంగా అభివృద్ధికి ఉపయోగపడటం లేదన్నారు. ఆయా గ్రామాల పరిధిలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలన్నారు.



భవానీపురం కాలనీలో కమ్యూనిటీహాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

అమీన్‌పూర్‌లోని కోకాకోలా యాజమాన్యం సహకారంతో పలు వార్డుల్లో కమ్యూనిటీహాళ్లు, డ్వాక్రా భవనాలకు నిధులు సమకూర్చినందుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నందారం నర్సింహగౌడ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం: ఎమ్మెల్యే

వెల్దుర్తి/నర్సాపూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండల పరిధిలోని దర్మారంలో విద్యుదాఘాతానికి గురై ఇల్లు దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. అధైర్య పడవద్దని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



విద్యుదాఘాతానికి గురైన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే వెంట మాజీ జడ్పీటీసీ రమేష్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్ రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు. అలాగే మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు రూ.1.70 లక్షల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. నర్సాపూర్ నియోజకవర్గంలోని పలు గిరిజనతండాలకు గత ప్రభుత్వంలో మంజూరైన బీటీరోడ్లకు నిధులు మంజూరై.. టెండర్ పూర్తయిందని, త్వరలో పనులు ప్రారంభం కానున్నట్లు ఎమ్మెల్యే సునీతారెడ్డి తెలిపారు. శనివారం ఎమ్మెల్యే సునీతారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ శివ్వంపేట మండలం అల్లీపూర్ పీడబ్ల్యూసీ రోడ్డు నుంచి తండావరకు రూ.70 లక్షలు, జడ్పీ రోడ్డు నుంచి తౌర్యాతండా వరకు రూ.1.54 కోట్లు, చందిగంగాయిపల్లి అప్రోచ్ రోడ్డు నుంచి జగ్యతండా వరకు రూ.49 లక్షల చొప్పున మంజూరయ్యాయని తెలిపారు.

ప్రజలపక్షాన పోరాడితే అక్రమ అరెస్టులా..?

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

టేక్మాల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజలపక్షాన పోరాడితే అక్రమ అరెస్టులు చేస్తారా.. అని అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మండల కేంద్రమైన టేక్మాల్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం నల్లబ్యాడ్జీలతో భారీ ర్యాలీ నిర్వహించారు. టేక్మాల్ బస్టాండ్ నుంచి గ్రామంలోని పురవీధుల గుండా ప్లకార్డులు చేతబూని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం బస్టాండ్ ఆవరణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా క్రాంతికిరణ్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఆరుగ్యారంటీలను ప్రకటించిన కాంగ్రెస్, సీఎం రేవంత్‌రెడ్డి తీరా గెలిచాక అమలుచేయడంలో



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

విఫలమయ్యారని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు భక్తుల వీరప్ప, సొసైటీ చైర్మన్ యశ్వంత్‌రెడ్డి, జోగిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాగభూషణం, నాయకులు పాల్గొన్నారు.

సమానత్వం కోసం పోరాడిన యోధుడు ఒడ్డె ఓబన్న



సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఒడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్/మెదక్ అర్బన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : అందరికి స్వేచ్ఛ, సమానత్వం కోసం పోరాడిన యోధుడు ఒడ్డె ఓబన్న అని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో శనివారం ఓబన్న జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, సహాయ బీసీ సంక్షేమాధికారి భాగ్యలక్ష్మి, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు లింగయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే మెదక్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఓబన్న జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, జిల్లా బీసీ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


నేటి నుంచి మోతీమాత జాతర

- ఉత్సవాలకు ఆలయం ముస్తాబు



జాతరకు ముస్తాబైన అమ్మవారి ఆలయం

జహీరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలోని అతిపెద్ద రెండో గిరిజన జాతర సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలంలోని ఉప్పర్‌పల్లితండా శివారులోగల మోతీమాత ఆలయం వద్ద జరుగనుంది. అందుకుగాను ఆలయం ముస్తాబమైంది. ఈ ఉత్సవాలకు కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారు. ప్రతియేటా సుమారు లక్ష పైచిలుకు భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకుంటారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధశాఖలకు చెందిన అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు.



ఆలయంలో కొలువైన మోతీమాత అమ్మవారు

పునాదులకే స్టేడియం పనులు పరిమితం

- మధ్యలో వదిలేసిన కాంట్రాక్టర్



పునాదుల్లోనే నిలిచిన స్టేడియం పనులు

నారాయణఖేడ్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారుల సౌలభ్యం కోసం నియోజకవర్గ కేంద్రమైన ఖేడ్‌లో చేపట్టిన స్టేడియం పనులు దశాబ్దకాలంగా పునాదులకే పరిమితమయ్యాయి. జిల్లాలోనే మారుమూల ప్రాంతంలో ఉన్న నారాయణఖేడ్‌లో క్రీడాకారులకు వసతి లేకపోవడంతో పదేళ్ల క్రితం తహసీల్ మైదానంలో స్టేడియం నిర్మాణం కోసం రూ.50 లక్షలు మంజూరు కావడంతో అధికారులు పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. పునాదుల వరకు వేగంగా పనులు చేపట్టిన కాంట్రాక్టర్ తర్వాత వదిలేశాడు. నారాయణఖేడ్‌కు చెందిన అనేక మంది మల్లయుద్ధం, బాక్సింగ్, తదితర పోటీల్లో సత్తాచాటుతూ గుర్తింపు పొందుతున్నారు. క్యారమ్స్, చెస్, షటిల్ టోర్నీల్లో సైతం నైపుణ్యం కలిగిన క్రీడాకారులు ఉన్నారు. 2016లో అప్పట్లో మంత్రిగా ఉన్న హరీశ్‌రావు అర్ధాంతరంగా పనులు నిలిపి వేయడంపై అధికారులపై ఆగ్రహం కూడా వ్యక్తం చేశారు. అయినా పనుల్లో ఎలాంటి కదలిక రాలేదు. ప్రస్తుత ఎంపీగా సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి స్పందించి ఈ పనులను వెంటనే పూర్తి చేయించాలని క్రీడాకారులు కోరుతున్నారు.

శిశుమందిర్‌లో సంక్రాంతి వేడుకలు

సంగారెడ్డి రూరల్/నర్సాపూర్/పెద్దశంకరంపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం కులబ్‌గూర్ గ్రామ శివారులోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో శనివారం ప్రధానాచార్యులు నర్సింహాగౌడ్ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థునులకు రంగవల్లి పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అలాగే నర్సాపూర్‌లోని అక్షర పాఠశాలలో శనివారం సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, స్థానిక నాయకులు జగదీష్, కరస్పాండెంట్ అశోక్ పాల్గొన్నారు. పెద్దశంకరంపేటలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీలు అందరినీ అలరించాయి. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు పేట మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, పాఠశాల అధ్యక్షుడు దాదిగారి గంగాధర్, జంగం రాఘవులు బహుమతులు ప్రదానం చేశారు. ప్రబంధ కార్య సభ్యులు క్రాంతిలాల్, పున్నయ్య, ప్రధానాచార్యులు వీరప్ప, జైహింద్ రెడ్డి, సీతారామారావు, సతీష్‌గౌడ్ పాల్గొన్నారు.



కులబ్‌గూర్ శివారులోని సరస్వతీ శిశుమందిర్‌లో సంక్రాంతి వేడుకల్లో చిన్నారులు

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



గాంధీభవన్‌లో మహేష్‌గౌడ్‌ను కలిసి సన్మానిస్తున్న కాంగ్రెస్ ఉమ్మడి మండల నాయకులు

గుమ్మడిదల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌ను జిన్నారం, గుమ్మడిదల మండల కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారని పీసీసీ సభ్యులు కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. శనివారం గుమ్మడిదలలో విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిన్నారం, గుమ్మడిదల మండలంలో కాంగ్రెస్ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపైన పీసీసీ అధ్యక్షుడితో చర్చించామని తెలిపారు. వీరి వెంట కాంగ్రెస్ జిన్నారం, గుమ్మడిదల మండల అధ్యక్షులు వడ్డే కృష్ణ, పుట్ట నర్సింగరావు, సీనియర్ నాయకుడు నందు తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక సంస్థల్లో యువతకు పెద్దపీట వేయాలి'

సంగారెడ్డి రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని పార్టీలు యువతకు పెద్దపీట వేయాలని నవభారత్ నిర్మాన్ యువసేన అధ్యక్షుడు, మెట్టు శ్రీధర్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీటీసీలుగా యువతకు అధిక ప్రాధాన్యతనివ్వడంతో పాటు దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరవేయడంలో యువత పాత్ర కీలకమని అన్నారు. విద్య, వైద్యం, ఉపాధి విషయాల్లో ఆధునిక సాంకేతికతను జోడించి అభివృద్ధి పథంలో గ్రామాలను యువనాయకత్వం నడిపిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ముస్లిం మిల్లి గ్రూప్ కమిటీ ఎన్నిక



నూతన కమిటీని సన్మానించిన జావెద్ మౌలానా

మెదక్ కల్చరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మెదక్ పట్టణ ముస్లిం మిల్లి గ్రూప్ కమిటీని ఆజంపురలోని మైనారిటీ ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహ్మద్ ఒమర్‌ఖాన్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ సూఫీ, సంయుక్త కార్యదర్శిగా (జర్నలిస్ట్)మహ్మద్ రియాజుద్దీన్, ఉపాధ్యక్షుడిగా ముజీబ్, కోశాధికారిగా మౌలానా అబేద్‌అలీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో కో ఆప్షన్ మెంబర్ ఉమర్, జావేద్ మౌలానా, నదీమ్, రవూఫ్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు

బీజేపీ మండల అధ్యక్షుల నియామకం

సంగారెడ్డి అర్బన్/జిన్నారం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలోని బీజేపీ పలు మండలాల అధ్యక్షులు, జిల్లా కౌన్సిల్ సభ్యులను నియమించినట్లు జిల్లా సంస్థాగత ఎన్నికల అధికారి, బీజేపీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గుమ్మడిదల మండల అధ్యక్షుడిగా ఐలయ్య, జిన్నారం మండల అధ్యక్షుడిగా జగన్‌రెడ్డి, అమీన్‌పూర్-1 అధ్యక్షుడిగా అనిల్‌కుమార్, మొగుడంపల్లి మండల అధ్యక్షుడిగా శ్రీలతలను ఎన్నుకున్నారు. అదే విధంగా జిల్లా కౌన్సిల్ సభ్యులుగా గోవర్ధన్‌రెడ్డి, సుధాకర్, ఆగారెడ్డి, జగన్ నియమించారు. రాష్ట్ర ఎన్నికల అధికారి ఎండల లక్ష్మీనారాయణ సిఫారసు మేరకు వారిని నియమించినట్లు ఆయన తెలిపారు. బీజేపీ జిన్నారం మండల అధ్యక్షుడిగా జగన్‌రెడ్డి నియామకం అయ్యారు. శనివారం పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు.

భారతీయ యువ పురస్కార్ అవార్డుకు జ్ఞానేశ్వర్



నాగల్‌గిద్ద, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ముక్తాపూర్ గ్రామానికి చెందిన పర్యావరణ ప్రేమికుడు పాలడుగు జ్ఞానేశ్వర్ భారతీయ యువ పురస్కార అవార్డుకు ఎంపికయ్యారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ 9 ఏళ్ల నుంచి ప్లాస్టిక్ నిర్మూలనతో పాటు పర్యావరణ పరిరక్షణకు సైకిల్‌యాత్ర నిర్వహించడంతో పాటు పలు పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ అవార్డును 31న కర్ణాటక రాష్ట్రంలోని కల్బుగిరిలో భారత్ వికాస్ భారత్ ఉత్సవంలో భాగంగా అందజేయనున్నట్లు జ్ఞానేశ్వర్ తెలిపారు.

కరస్‌గుత్తిలో మెగా హెల్త్ క్యాంపు

నాగల్‌గిద్ద, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కరస్‌గుత్తి గ్రామంలో శనివారంమెగా హెల్త్ క్యాంపును జిల్లా ప్రణాళిక మండలి మాజీ సభ్యుడు నగేష్‌షెట్కార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో ఇలాంటి ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్, మాజీ జడ్పీటీసీ రూప్‌సింగ్, నాయకులు పండరినాథ్‌పటేల్, రహీం, పండరి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

నారాయణఖేడ్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపడానికి అభయహస్తం, నేతన్న భద్రత, నేతన్న భరోసా తదితర పథకాలను ప్రకటించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ శనివారం ఖేడ్ మండల పరిధిలోని హన్మంత్‌రావుపేట భక్త మార్కండేయ చేనేత సహకార సంఘం ఆవరణలో సంఘం సభ్యులు, చేనేత కార్మికులు సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఫిబ్రవరి నుంచే ఆయా పథకాలను అమలు చేయనుండగా.. అందుకు సంబంధించిన మార్గదర్శకాలను త్వరలోనే ప్రకటిస్తామని చేనేత, జౌళిశాఖ ప్రకటించడం పట్ల వారు ఆనందం వ్యక్తం చేశారు.

'వర్గీకరణ సభను విజయవంతం చేయాలి'



సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నేత కార్మికులు

రామయంపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 25న హైదరాబాద్‌లో తలపెట్టిన ఎమ్మార్పీఎస్ సభ విజయవంతం చేసేందుకు రామాయంపేటలో ఆ పార్టీ నేతలు సమావేశం అయ్యారు. ఈ మేరకు శనివారం జాతీయ, రాష్ట్ర నాయకులు మాసాయిపేట యాదగిరి నేతృత్వంలో ఇక్కడి ఓ ఫంక్షన్‌హాల్‌లో రౌండ్ సమావేశం జరిగింది. దీనిలో పాతూరి రాజు లద్ద నరసింహులు, మల్యాల కిషన్, బాలరాజ్ ఉన్నారు.

పోగొట్టుకున్న 10 ఫోన్లు అందజేత

తూప్రాన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలానికి చెందిన 10 మంది ఫోన్లు పోగొట్టుకున్నారు. దీంతో సీఈఐఆర్ యాప్‌లో నమోదు చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫోన్లను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. కాగా శనివారం పదిమంది బాధితులకు తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఫోన్లు అందజేశారు.